సాక్షి జగిత్యాల

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



భక్తుల కోలాహలం

జగిత్యాల: వేదపండితుడు తీగుళ్ల విమశర్మ ఆధ్వర్యంలో ఈనెల 24న ప్రారంభించిన శివపురాణం శనివారం కొనసాగింది.



రాజన్న నామస్మరణ

వేములవాడ: రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులతో తరలివస్తున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం

33.0/23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయ సలహా కేంద్రం ప్రారంభం



న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి

బుగ్గారం(ధర్మపురి): రైతులకు వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించడానికి, ఆర్థికంగా వెనుకబడిన వారికి న్యాయ సలహాలు, సూచనలు అందించడానికి ధర్మపురిలోని నర్సయ్యపల్లె రైతువేదికలో ఏర్పాటు చేసిన న్యాయ సలహా కేంద్రాన్ని జూనియర్ సివిల్ జడ్జి శ్యామ్ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ ఉత్తర్వుల మేరకు సలహా కేంద్రం ప్రారంభించినట్లు జడ్జి తెలిపారు. రైతులు, ఆర్థికంగా వెనుకబడినవారు తమకు అవసరమైన సమయంలో సాయం, సలహాలు పొందాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, న్యాయవాదులు నిరంజన్, రౌతు రాజేశ్, రామడుగు రాజేశ్, సంబరాజుల కార్తీక్, జాజాల రమేశ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, నాయకులు గడ్డం మహిపాల్‌రెడ్డి, నర్సయ్యపల్లె, సర్పంచ్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటికొక ఇంకుడుగుంత తప్పనిసరి

జగిత్యాలరూరల్: ఇంటికొక ఇంకుడుగుంత తప్పనిసరి తవ్వించాలని డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. పొరండ్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇంకుడుగుంతల నిర్మాణంపై గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. భూగర్భజలాల పరిరక్షణ కోసం ఇంకుడుగుంతలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వర్షపు నీరు, వృథా నీటిని ఇందులోకి మళ్లిస్తే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. ఈ విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొగ్గళ్ల సంధ్యారాణి, ఎంపీటీసీ ఆరె సౌజన్య, ఉపసర్పంచ్ పడిగెల సునీత, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో కందుకూరి రవిబాబు, మహిళా సంఘం నాయకులు పడాల జ్యోతి, రమ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కోరుట్లరూరల్: కల్లూరు శివారులో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిదులు శనివారం పరిశీలించారు. తమకు పరిహారం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని బాధిత రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ఎంపీటీసీ చిట్నేని లత, రైతులు సోమిశెట్టి నడిపి గంగారాం, దశరథం, కిషన్, దేవేందర్, మహేశ్, రాజారపు భూమయ్య, చాంద్ పాషా, రవి, మధు, జగన్‌రావు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

టెండర్లు లేకుండా పనులు?

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో చేపట్టే వివిధ పనులను టెండర్లు పిలవకుండానే చేయిస్తూ ఆలయ ఆదాయానికి గండికొడుతున్నారని తెలిసింది. ఉత్సవాల సందర్భంగా అలంకరణ, పారిశుధ్య కార్మికుల నియామకం, లడ్డూ ప్రసాదాల ప్యాకింగ్ కార్మికులను తాత్కాలిక పద్ధతిన నియమిస్తున్నారని సమాచారం. టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్ ద్వారా కార్మికులను నియమించాల్సి ఉన్నా.. అధికారులు అలా చేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. అసిస్టెంట్ హోదా కలిగిన ఆలయాల్లోనూ టెండర్ల ద్వారా పనులు చేస్తుంటే డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన కొండగట్టులో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి టెండర్ ద్వారా పనులు అప్పగించేలా చూడాలని అంజన్న భక్తులు కోరుతున్నారు.

'కొత్త జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి'

జగిత్యాల: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టకుంటే విద్యారంగంపై తీవ్రప్రభావం పడుతుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శనివారం టీఎస్ యూటీఎఫ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ విద్యావిధానం – 2020 రద్దు చేయాలన్నారు. కేంద్రబడ్జెట్‌లో 10 శాతం విద్యారంగానికి కేటాయించాలని ఆయన కోరారు. పదో తరగతి పాఠ్యాంశంలో డార్విన్ పరిణామ సిద్ధాంతం తొలగించడమంటే శాస్త్రీయం కాదని, భవిష్యత్ తరాలను మూఢ విశ్వాసాల వైపునకు తీసుకెళ్లడమేనని అన్నారు. ఇందుకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్, సుశీల, బన్న, ప్రసాద్, ఆగమయ్య, శ్రీధర్, శంకర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జగిత్యాల' మామిడి

సండే స్పెషల్

వేసవి సీజన్ పండు మామిడి. తినేందుకు, పచ్చడికి మామిడికాయ వినియోగిస్తారు. బంగినపల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు.. ఇలా ఒక్కో మామిడికాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫలరాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. మామిడి ఎగుమతికి జగిత్యాల కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాలో మంచి డిమాండ్ ఉంది. నాణ్యత, రుచి ఉండడంతో కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతోంది.

– వివరాలు 6లో...



'సాక్షి' ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ

జగిత్యాల: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో మే 1 నుంచి 3వ తేదీ వరకు చదరంగం, నృత్యంలో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రముఖ చెస్ ప్లేయర్ మ్యాకల శ్రీకాంత్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

వేదిక : కిడ్డీ రూట్స్ పాఠశాల, కృష్ణానగర్, డాక్టర్ ఎండీ శంకర్ హాస్పిటల్ ఎదురుగా, జగిత్యాల

వివరాలు, పేర్ల నమోదుకు :
97053 46639, 80084 36363
నంబర్లలో సంప్రదించాలి.
జగిత్యాల

రైతులకు 'బైపాస్' కష్టాలు

- ఎన్‌హెచ్– 63 విస్తరణలో అధికారులు
- 305 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్
- కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలో రేపటినుంచి సర్వే
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- విలువైన వ్యవసాయ భూములు కోల్పోతామని ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న వెల్లుల్ల గ్రామ రైతులు(ఫైల్)

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని జాతీయ రహదారి(ఎన్‌హెచ్ –63)ని నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్‌హెచ్ మార్గంలోని పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బైపాస్ రోడ్లు కూడా నిర్మించాలని నిర్ణయించారు. మెట్‌పల్లి, కోరుట్ల రెవెన్యూ డివిజన్లలో ఇందుకు అవసరమైన భూ సేకరణకు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. సుమారు 305 ఎకరాలు సేకరించడానికి సోమవారం నుంచి సర్వే చేయనున్నారు. అంతా బాగానే ఉన్నా.. బైపాస్ రోడ్ల నిర్మాణంపై అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము విలువైన భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బైపాస్‌ల ఆలోచనను విరమించుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మేడిపల్లి నుంచి మేడిపల్లి వరకు బైపాస్

మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలకు దూరంగా వాహనాలను మళ్లించేందుకు సుమారు 31కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణానికి ప్రతిపాదించారు. మెట్‌పల్లి, కోరుట్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని మేడిపల్లి(పడమర) గ్రామం నుంచి బైపాస్ రహదారి ప్రారంభించి.. బండలింగాపూర్, వెల్లుల్ల, చౌలమద్ది, పెద్దాపూర్, యెఖీన్‌పూర్, సంగెం, వెంకటాపూర్, గుమ్లాపూర్, మోహన్‌రావుపేట మీదుగా మేడిపల్లి(తూర్పు) వరకు నిర్మించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. మెట్‌పల్లి డివిజన్‌లో 144 ఎకరాలు సేకరించి 14కిలోమీటర్లు.. కోరుట్ల డివిజన్‌లో 160 ఎకరాలు సేకరించి 16కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మించాలని భావిస్తున్నారు.

ఆందోళనలో అన్నదాతలు..

- బైపాస్‌ల నిర్మాణంతో విలువైన వ్యవసాయ భూములు కోల్పోతామని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.
- ప్రభుత్వం భూములు సేకరిస్తే.. తమ బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం ఆ మేరకు పరిహారం ఇవ్వకపోతే తాము ఆర్థికంగా నష్టపోతామని వాపోతున్నారు.
- అధికారులు ఇప్పటికే గ్రామాల వారీగా సేకరించే భూముల వివరాలను ప్రకటించారు.
- అంతేగాకుండా మే ఒకటో తేదీ నుంచి సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.
- సమాచారం అందుకున్న వెల్లుల్ల రైతులు శుక్రవారం మెట్‌పల్లిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బైపాస్‌ల ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

మంచిర్యాల వరకు విస్తరణ

- ఎన్‌హెచ్ – 63ను నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి మోర్తాడ్, కమ్మర్‌పల్లి, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం వంతెన మీదుగా మంచిర్యాల వరకు ఫోర్‌లేన్‌గా విస్తరించనున్నారు.
- సుమారు 131 కిలోమీటర్ల మేర విస్తరించే ఈ రహదారి నిర్మాణానికి దాదాపు రూ.2,581కోట్లు అవసరమని ప్రతిపాదించారు.
- జిల్లాలోని ఎన్‌హెచ్ మార్గంలో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి పట్టణాలు ఉన్నాయి.
- వీటిమీదుగా విస్తరణ చేపడితే జనావాసాలు దెబ్బతింటాయనే ఉద్దేశంతో బైపాస్‌ల నిర్మాణానికి నిర్ణయించారు.
- ప్రస్తుతం మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల్లో బైపాస్‌ల కోసం భూసేకరణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

ఆర్థికంగా నష్టపోతం



సర్వే నంబర్ 317లో మా కుటుంబానికి భూమి ఉంది. ఇందులో 25గుంటలు రోడ్డుకు పోతుందని చెబుతున్నరు. బహిరంగ మార్కెట్‌లో గుంటకు రూ.12లక్షల ధర ఉంది. ప్రభుత్వం అంతధర ఇవ్వదంటున్నరు. బైపాస్‌తో మాకు నష్టం తప్ప లాభం ఉండదు.

– పెద్ద గంగారెడ్డి, రైతు, వెల్లుల్ల

ఆలోచన విరమించుకోవాలె



మాకు వ్యవసాయమే దిక్కు. ప్రభుత్వం రోడ్ల పేరిట భూములు తీసుకుంటే మా కుటుంబాలు రోడ్డున పడ్తయి. బలవంతంగా లాక్కొని ఇబ్బందులకు గురిచేయడం తగదు. బైపాస్‌ల ఆలోచనను విరమించుకోవాలి. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తం.

– మారు మురళీధర్‌రెడ్డి, రైతు, వెల్లుల్ల

అభ్యంతరాలు స్వీకరిస్తాం

బైపాస్ రోడ్ల నిర్మాణం కోసం రెండు రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో భూసేకరణకు నోటిఫికేషన్ జారీచేశాం. అభ్యంతరాలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– వినోద్‌కుమార్, ఆర్డీవో, మెట్‌పల్లి

ప్రశాంతంగా జవహర్ నవోదయ పరీక్ష



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

చొప్పదండి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జవహర్ నవోదయలో ఆరో తరగతి అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరో తరగతిలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షకు 7,730 మంది దరఖాస్తు చేసుకోగా, 6,845 మంది హాజరయ్యారని విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.

ప్రజాపంథాలో పలువురి చేరిక



ప్రజాపంథాలో చేరుతున్న న్యూడెమోక్రసీ శ్రేణులు

కోరుట్ల: పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో శనివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సమావేశం నిర్వహించారు. న్యూడెమోక్రసీ నాయకులు ప్రజాపంథా పార్టీలో చేరారు. న్యూ డెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు ఆరెల్లి భీమయ్య, డి.శ్రీనివాస్, ఎండీ జాహిద్, మహేందర్, ఎం.శంకర్, ఎండీ కరీం, రాతూరి అశోక్, బుచ్చన్న, స్వామి, ఎండీ అమీర్ ప్రజాపంథాలో చేరినవారిలో ఉన్నారు. వీరికి ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్, నంది రామయ్య, జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, నాయకులు జిందం ప్రసాద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా రాష్ట్ర సహాయ కార్యదర్శి సారా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేదాకా పోరు


- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ
- ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణ శివారులోని సంగెం రోడ్డు జంబిగద్దె ప్రాంతంలో ఇళ్లులేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చేవరకూ గుడిసెలు వేసిన భూమిని వదిలే ప్రసక్తేలేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట గుడిసెలు వేసుకున్న మహిళలతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలకృష్ణ, సీపీఎం జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్ మాట్లాడారు. సంగెం రోడ్డు జంబిగద్దె ప్రాంతంలోని సర్వే నంబర్ 922, 923లో సుమారు 52 ఎకరాల్లో ఇళ్లులేని నిరుపేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. అప్పటివరకు పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. భారతదేశంలో ప్రతీపౌరుడు నివసించేందుకు ఇల్లు ఉండాలని న్యాయస్థానాలే తీర్పులు చెప్పాయని గుర్తుచేశారు. దేశంలో 2022 వరకు ఇల్లు లేని కుటుంబం ఉండదని కేంద్ర ప్రభుత్వమే చెప్పిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇల్లులేని ప్రతీ నిరుపేదకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ గుమ్మడి రమేశ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, పోరాట కమిటీ సభ్యులు రిజీయ, సుల్తానా, చిలుక ఉమ, పిట్టల హేమలత, మమత, రిహానాబేగం, తోట జ్యోతి, పాటల గోపి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ హయాంలోనే నిజమైన అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన యువకులు చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో శనివారం జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పాలనలో ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. నాయకులు వెల్మల ఛ్మారెడ్డి, దారం ఆదిరెడ్డి, రాజిరెడ్డి, వీరమల్లుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణచారి, తిరుపతి, లక్ష్మణ్, అరుణ్‌కుమార్, విజయ్, రాకేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఉల్లంఘిస్తోంది..

సారంగాపూర్(జగిత్యాల): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వమే నిబంధనలు ఉల్లంఘిస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జగిత్యాలరూరల్: డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. తిప్పన్నపేటలోని డబుల్‌బెడ్‌రూంఇళ్ల కాలనీని ఆయన పరిశీలించి మాట్లాడారు. హైదర్‌పల్లి ఎల్లమ్మతల్లి ఆలయ బోరు నిర్మాణానికి రూ.1.25 లక్షలు మంజూరు చేశారు. అనంతరం తాటిముంజలు తిని రుచిచూశారు.

వైద్యకళాశాలకు అనుమతి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు రెండోసంవత్సరం నిర్వహణకూ అనుమతి లభించింది. ఎన్ఎంసీ నిబంధనల మేరకు కళాశాల నిర్వహించడంతో ఇటీవల ప్రతినిధులు తనిఖీ చేశారు. సౌకర్యాలు, ఏర్పాట్లు, నిర్వహణపై ఆరా తీశారు. అన్ని వసతులు, నిర్వహణ తీరుపై వారు సంతృప్తి చెందడంతో రెండో సంవత్సరానికీ అనుమతించారు. మరో 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఈ ఆగస్టులో ప్రవేశాలు పొందనున్నారు. ఇలా ఐదేళ్లపాటు ఎన్ఎంసీ అనుమతి లభిస్తూ ఉండాలి. రాష్ట్రంలోనే తొలిసారి జగిత్యాల వైద్య కళాశాలకు ఎంబీబీఎస్ రెండో సంవత్సరం అనుమతి లభించడం విశేషం.

3నుంచి సదరం శిబిరాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మే 3వ తేదీ నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రాములు శనివారం తెలిపారు. 3న ఆర్థోపెడిక్, 10న విజువల్, 17న ఆర్థోపెడిక్, 24న హియరింగ్, 26న ఆర్థోపెడిక్, 31న ఎంఆర్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ రశీదు, ఆధార్‌కార్డు వెంట తీసుకుని రావాలని ఆయన కోరారు.

భరోసా సభను విజయవంతం చేయాలి

జగిత్యాల: తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింబాద్రి అన్నారు. దానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు ప్రతీ నియోజకవర్గం నుంచి ప్రజలు భారీసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెల నారాయణ, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించే ప్రసక్తే లేదు

- జూనియర్ పంచాయతీ కార్యదర్శుల హెచ్చరిక
- రెండోరోజుకు చేరిన సమ్మె



సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మద్దతు ప్రకటించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని తీర్మానం చేసి ఆమోదించారు. జెడ్పీటీసీ మహేశ్, ఎంపీపీ ములాసపు లక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రూరల్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహేశ్, ఎంపీటీసీలు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు మద్దతు పలిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, జనరల్ సెక్రటరీ వనజ పాల్గొన్నారు.

సమ్మె కొనసాగిస్తాం..

తమ డిమాండ్లను నెరవేర్చేవరకూ సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హెచ్చరించారు. జిల్లాస్థాయి అధికారులు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పిలిపించి సమస్యపై చర్చించారు. విధులకు హాజరు కాకుంటే టర్మినేట్ చేస్తామని హెచ్చరించారు. అయినా, వెనక్కి తగ్గేదేలేదని పంచాయతీ కార్యదర్శులు స్పష్టం చేశారు. తమ పోస్టులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

రైతులకు పరిహారం చెల్లించండి



బీజేపీ నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు

- బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

మెట్‌పల్లి(కోరుట్ల): అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం భారతీయ జనతా పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలు చేసి మామిడి, జామ రైతులకు ఎకరాకు రూ.80 వేల పరిహారం చెల్లించాలని అన్నారు. అలాగే వరి, మొక్కజొన్న, నువ్వు, సజ్జ పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు అందజేయాలని కోరారు. ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించడంతో పాటు, రైతులకు రూ.లక్ష రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఇల్లెందుల శ్రీనివాస్, కిషన్ మోర్చా అధ్యక్షుడు కోడిపెల్లి గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ చట్టపల్లి సుఖేందర్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేశ్, నాయకులు సురభి నవీన్‌కుమార్, ధోనికేల నవీన్, సారప క రమేశ్, యాదగిరి బాబు, మామిడి నారాయణరెడ్డి, గురిజెల రాజారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో 870 ర్యాంక్


రిష్వంత్‌రెడ్డి

జగిత్యాలరూరల్: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో పట్టణానికి చెందిన బేతి రిష్వంత్‌రెడ్డి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 870వ ర్యాంక్ సాధించాడు. స్థానిక అరవింద్‌నగర్‌లోని పంచాయతీరాజ్ ఉద్యోగి బేతి కృష్ణారెడ్డి చిన్నకుమారుడు రిష్వంత్‌రెడ్డి.. మంచి ర్యాంక్‌తో 99.94 పర్సెంటైల్ సాధించడంపై పలువురు ప్రతినిధులు తదితరులు అభినందించారు.

అట్రాసిటీ కేసుపై విచారణ


విచారణ జరుపుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఎర్దండిలో అట్రాసిటీ కేసుపై మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి శనివారం విచారణ జరిపారు. ఈనెల 24న ఎర్దండి గ్రామానికి చెందిన నీరెటి రఘు, అతడి స్నేహితుడు చిలుకూరి రాజేందర్ మద్యం తాగడానికి గ్రామ శివారులోని మల్లన్న గుట్టకు వెళ్లారు. అక్కడ మద్యం తాగాక ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో నీరటి రఘుపై చిలుకూరి రాజేందర్ దాడి చేయడంతోపాటు కులం పేరుతో దూషించాడు. నీరటి రఘు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఉమాసాగర్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో డీఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని ప్రత్యక్ష సాక్షులను విచారణ జరిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఉమాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ పెద్దజయంతి పోస్టర్ విడుదల

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మే 15వ తేదీన నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను శనివారం ఆవిస్కరించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో అంజన్న సన్నిధిలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు.

తాటిముంజలు తిని..

కాగా, కొండగట్టు దిగువ దారి వెంట ఉన్న తాటిముంజలను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తిని వాటి రుచిని ఆస్వాదించారు.

బాల్య వివాహానికి యత్నం

- అడ్డుకుని కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు

కథలాపూర్(వేములవాడ): తాండ్ర్యాల గ్రామంలో ఓ బాలికకు వివాహం చేసేందుకు ప్రయత్నం చేయగా.. కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ శనివారం రంగంలోకి దిగి పలువురు గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలిక ప్రస్తుతం ఇంటర్ చదువు తోంది. మైనర్ కావడంతో వివాహం వద్దని బాలిక చెప్పినా.. కొందరు ఒత్తిడి చేస్తున్నారని బాధితురాలు ఇటీవలే ఎస్పీని ఆశ్రయించింది. దీంతో శనివారం కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ సదరు వ్యక్తిని, వారి బంధువులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను వివాహం కోసం ఒత్తిడి తెస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

‘జగిత్యాల’ మామిడి

- మామిడి ఎగుమతికి కేరాఫ్ జగిత్యాల
- ఇక్కడి కాయలకు పలు రాష్ట్రాలు, దేశాల్లో మంచి డిమాండ్
- నాణ్యత, రుచితో కొనుగోలుకు వ్యాపారుల పోటీ
- ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200కోట్ల వ్యాపారం

జగిత్యాలఅగ్రికల్చర్: బంగినపల్లి, హిమాయత్, దశేరీ, సువర్ణరేఖ, నీలం, ముల్‌గోవా, రసాలు ఇలా ఒక్కో మామిడికాయకు ఒక్కో ప్రత్యేక పేరు ఉంటుంది. కానీ ఫలరాజు మామిడి అంటే టక్కున గుర్తుకొచ్చే ప్రాంతం జగిత్యాల. దేశవిదేశాల్లో ఎక్కడున్నా.. సీజన్‌లో జగిత్యాల నుంచి వచ్చిన మామిడిపండును రుచిచూడక మానరు. జగిత్యాల మామిడికి రుచి, పరిమాణంలో ప్రత్యేకత ఉంటుంది. అందుకే దేశంలోని అన్ని రాష్ట్రాలకు, విదేశాలకు సీజన్‌లో టన్నుల కొద్ది మామిడికాయ ఎగుమతి అవుతుంది. ఏటా రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వ్యాపారం ఇక్కడ జరుగుతుంది.

సండే స్పెషల్


లారీల్లో తరలిస్తున్న మామిడికాయలు

వైఎస్సార్ ఏర్పాటు చేసిన మార్కెట్

మొన్నటి వరకు కల్లోల ప్రాంతంగా ముద్రపడిన జగిత్యాల నేడు మామిడి రుచులతో దేశ,విదేశాల్లో గుర్తింపు తెచ్చుకుంటోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి అప్పటి మంత్రి జీవన్‌రెడ్డి ప్రోద్బలంతో జగిత్యాలలో రాజీవ్‌గాంధీ మామిడి మార్కెట్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం మామిడి మార్కెట్లలో వసతులు కల్పిస్తుండడంతో మరింత డిమాండ్ ఏర్పడింది. జగిత్యాల మామిడి మార్కెట్‌తో పాటు మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల నుంచి ఏటా రూ.200కోట్ల వరకు వ్యాపారం సాగుతోంది.


మామిడికాయలను ప్లాస్టిక్ ట్రేలో నింపుతున్న కూలీలు

ఈసారి తగ్గిన దిగుబడి..

రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా ఢిల్లీవరకు మామిడి ఎగుమతి అయ్యింది. మార్కెట్లోని 88మంది కమీషన్ ఏజెంట్లు ఇతరరాష్ట్రాల వ్యాపారులకు మామిడిని పంపిస్తుంటారు. ఈ ఏడాది మామిడికాయకు మంగు ఏర్పడటం, కాయలు తక్కువగా ఉండటంతో వ్యాపారం కాస్త తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల్లో మామిడి తోటల విస్తీర్ణం ఉండగా, కనీసం 1.50లక్షల మెట్రిక్ టన్నుల మామిడికాయ రావాల్సిఉండగా.. పంటనష్టంతో సగం దిగుబడే వచ్చే అవకాశముంది.

జగిత్యాల మామిడికి గిరాకీ ఎందుకంటే

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నూజివీడు, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, తిరుపతి, జగిత్యాలలో మామిడి మార్కెట్లు ఉన్నాయి. దేశం మొత్తం దిగుబడుల్లో సగంవాటా రెండు తెలుగు రాష్ట్రాలదే. ఇందులో 10–15శాతం వాటా జగిత్యాల మామిడిదే ఉంటుంది. ఈ ప్రాంతంలోని ఎర్రనేలలు మామిడిపంటకు అనుకూలమైనవి. కాయ రంగు, రుచి బాగుంటుంది. నీటివసతి కారణంగా పరిమాణం పెద్దదిగా ఉంటుంది. ఇక్కడి మామిడికాయలు రవాణాలో డ్యామేజీ కావు. ఎన్నిరోజులైనా కాయ నాణ్యతగా ఉంటుంది. ఢిల్లీ వంటి మార్కెట్లలో జగిత్యాల కాయరాగానే వ్యాపారులు కొనుగోలుకు పోటీ పడుతుంటారు. రెండేళ్ల క్రితం కిసాన్ రైలు ద్వారా జగిత్యాల నుంచి దాదాపు 3–4 వేల మెట్రిక్ టన్నుల మామిడికాయ ఢిల్లీకి ఎగుమతైంది.

మంచి రుచితో విదేశాలకు

జగిత్యాల జిల్లాలో 50వేల ఎకరాలు, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, నిర్మల్ ప్రాంతాల్లో మరో 30వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది. బంగిన్‌పల్లి, హిమాయత్, దశేరీ రకాలనే ఇక్కడి రైతులు సాగు చేస్తుంటారు. కాయలను నైపుణ్యం గల ఇతర రాష్ట్రాల కార్మికులు గ్రేడింగ్ చేసి, ఢిల్లీకి పంపిస్తున్నారు. అక్కడి ఎగుమతి వ్యాపారులు గల్ఫ్‌దేశాలైన దుబాయ్, ఖతర్, మస్కట్, సౌదీ, బహ్రెయిన్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్, నేపాల్‌కు ఎగుమతి చేస్తున్నారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, జమ్ము కాశ్మీర్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్, వారాణాసీ, అలహాబాద్, ఛండీఘర్, నాగ్‌పూర్, నాసిక్, ముంబై, చంద్రపూర్, నాందేడ్ తదితర ప్రాంతాలకు ఇక్కడి సరుకు ఎగుమతి అవుతుంది. దశేరి రకం హైదరాబాద్, బెంగళూర్, ముంబయి వంటి మెట్రోసిటీలకు ఎగుమతవుతోంది.

రైతుకు లాభం అంతంతే..

ఈ పంటసాగులో రైతులకు లాభం అంతంతే. ఓపెన్ మార్కెట్ లేకపోవడం, కమీషన్ ప్రతిపాదికన వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన రేటు పెట్టి కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులదే పైచేయి అవుతోంది. రాటన్, సూట్ పేరిట చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు నేరుగా నాగ్‌పూర్ మార్కెట్‌కు కాయలు తీసుకెళ్తున్నారు.

ధరలేదు



ఏటా మామిడికాయలను మార్కెట్‌కు తీసుకువస్తున్నప్పటికీ సరైన ధరరావడం లేదు. జిల్లా అయినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకున్నట్లు కనబడటం లేదు. ఈ ఏడాది ఓ వైపు రేటు రాకపోవడమే కాకుండా, మరోవైపు కాయకు మంగు వచ్చి నల్లగా మారాయి. అకాల వర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి.

– రవీందర్‌రెడ్డి, రైతు, రాయికల్

జగిత్యాల కాయకు డిమాండ్



జగిత్యాలకాయకు అన్ని రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ వ్యాపారులు కొనుగోలు చేసిన కాయ ఢిల్లీకి వెళ్లి, అక్కడి నుంచి విదేశాలకు వెళ్తుంది. జగిత్యాలకు చెందిన కాయ తాజాగా, పరిమాణంలో పెద్దగా కనబడటంతో చాలామంది కొనుగోలు చేస్తుంటారు.

– ఎండీ మోయిన్, మామిడి వ్యాపారి, జగిత్యాల

జగిత్యాల మామిడి బ్రాండ్



జగిత్యాల మామిడి అంటేనే ఓ బ్రాండ్. నాణ్యతతో పాటు రుచిగా ఉంటుంది. రాబోయే రోజుల్లో జగిత్యాల మామిడి మార్కెట్‌ను తెలంగాణలోనే ఓ మోడల్ మామిడి మార్కెట్‌గా తీర్చిదిద్దనున్నాం. అదనంగా 10 ఎకరాల స్థలం మామిడి మార్కెట్‌కు తీసుకోవడంతో పాటు రూ.7 కోట్లతో షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

– నక్కల రాధ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, జగిత్యాల

మంచి డిమాండ్ ఉంది



జిల్లాలో 50 వేల ఎకరాల వరకు, చుట్టుపక్కల జిల్లాలో మరో 30వేల ఎకరాల వరకు మామిడి సాగవుతోంది. ఇక్కడి కాయకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. రంగు, రుచితో పాటు ఎన్ని రోజులు రవాణా చేసినా చెడిపోదు అనే పేరుంది. మామిడికి ఉన్న డిమాండ్, వడగాల్పుల దృష్ట్యా కాయ ముదరక ముందే తెంపి, ఇతర రాష్ట్రాలకు పంపించడంతో ముక్కిపోతుంది.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చూసి మోసపోవద్దు

జగిత్యాలక్రైం: ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటనలు చూసి మోసపోవద్దని రూరల్ ఎస్సై అనిల్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల శివప్రసాద్ ఉద్యోగం కోసం తన వివరాలు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయగా తన నంబరుకు వాట్సప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి శివప్రసాద్ ఖాతా నుంచి రూ.1.72 లక్షలు తీసుకున్నారని తెలిపారు. ఉద్యోగం ఇప్పించకపోవడంతోపాటు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని అన్నారు. బాధితుడు శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అగంతకులు ఫోన్ ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు వెల్లడించొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరస్తులు మోసం చేసినట్లయితే సత్వరమే 1930కు కాల్ చేయాలని సూచించారు.

జీవన్‌రెడ్డిని విమర్శించే స్థాయిలేదు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: జీవన్‌రెడ్డిని విమర్శించే స్థాయి చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్‌కు లేదని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన జిల్లాకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దళితులకు ఎంతో మేలు చేసిందన్నారు. దళితబంధులో అక్రమాలకు పాల్పడిన వారి చిట్టా ఉందని ముఖ్యమంత్రి అంటే.. ఆ విషయంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఎవరికీ లేదని, అనవసరపు మాటలు మాట్లాడవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడిపల్లి సత్యం, దుర్గయ్య, నక్క జీవన్, మన్సూర్, మున్న, గుండ మధు, బీరం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రైతులను ఆదుకోకుంటే ఆందోళన చేస్తాం

బుగ్గారం(ధర్మపురి): అకాల వర్షాలతో ధాన్యం నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హెచ్చరించారు. బుగ్గారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం నష్టపోయిన రైతులను పరామర్శించారు. నాయకులు వేముల సుభాష్, నర్సాగౌడ్, రాజన్న, తిరుపతి, శ్రీధర్, అంజిత్, చిన్న నర్సాగౌడ్, నర్సయ్య, లచ్చన్న, పోషన్న పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందిపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న గంగారాం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ కేంద్రంలో డాక్టర్ల నిర్లక్ష్యంతో గర్భిణులు మృతి చెందుతున్నారని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల మండలి జిల్లా అధ్యక్షుడు నక్క గంగారాం కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, వైద్యులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

చైన్‌బ్లాక్ తలపై పడి వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


గంగాధర్ (ఫైల్)

కోరుట్లరూరల్: అయిలాపూర్ గ్రామ శివారులో బోరుబావి పైప్‌లైన్ పైకి తీస్తుండగా చైన్‌బ్లాక్ తలపై పడి అమందు గంగాధర్ (52) మృతి చెందాడు. యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన అమందు గంగాధర్, బొద్దుల సత్యనారాయణ బోరుబావుల పైప్‌లైన్ మరమ్మతు చేస్తుంటారు. ఈ క్రమంలో శనివారం అయిలాపూర్ గ్రామ రైతు కుర్మ మారుతికి చెందిన పొలం వద్ద బోరుబావి పైప్‌లైన్‌ను చైన్ బ్లాక్ ద్వారా పైకి తీస్తున్నారు. ఈ క్రమంలో చైన్‌బ్లాక్ ప్రమాదవశాత్తు గంగాధర్, సత్యనారాయణపై పడింది. ఈ ఘటనలో గంగాధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ అంబులెన్స్‌లో సాస్పత్రికి తరలిస్తుండగా గంగాధర్ మార్గమధ్యంలోనే మృతి చెందాడు. సత్యనారాయణను కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గంగాధర్ మృత దేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం యూసుఫ్‌నగర్ తరలించారు. గంగాధర్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- సిస్టం స్ట్రెంతనింగ్ పథకం ద్వారా శాశ్వత మరమ్మతులు
- విద్యుత్ వినియోగం పెరిగినా అంతరాయం ఉండదు
- విడతల వారీగా జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్న ట్రాన్స్‌కో సిబ్బంది


విద్యుత్ వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

కథలాపూర్(వేములవాడ): వ్యవసాయం కోసం విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వ్యవసాయ విద్యుత్ మోటార్ల కనెక్షన్లు ఇవ్వాలని కోరుతున్న రైతులు సంఖ్య పెరిగింది. కానీ ఓవర్ లోడ్, పాత సామగ్రి వినియోగించడంతో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. మరోవైపు పంటచేల వద్ద ఏళ్ల క్రితం బిగించిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరమ్మతులు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యం చేసేవారు. ఇకనుంచి ఆ సమస్యలు తప్పనున్నాయి. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మరమ్మతులు చేసేందుకు ప్రత్యేకంగా ‘సిస్టం స్ట్రెంతనింగ్’ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద విద్యుత్ సబ్‌స్టేషన్ల వారీగా సమస్యలను గుర్తించేందుకు సర్వేలు చేసి శాశ్వత ప్రాతిపాదికన మరమ్మతులు చేయడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

రూ. 5 కోట్లతో మరమ్మతులు.

‘సిస్టం స్ట్రెంతనింగ్’ పథకాన్ని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలను కలిపి ఒక యూనిట్‌గా తీసుకొని అమలుచేస్తారు. ప్రస్తుతం కథలాపూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కథలాపూర్, సిరికొండ, దూలూర్, దుంపేట, పోసానిపేట గ్రామాల్లో అమలు చేస్తున్నారు. ఈ ఐదు గ్రామాల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ మోటార్లకు ఉపయోగించే స్తంభాలు, వైర్లు, ఓవర్‌లోడ్ సమస్యలు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు దూరంగా ఉంటే వాటిని సమీపంలో బిగించడం లాంటి పనులు చేయాలని ఇటీవలే సర్వే చేశారు. ఐదు గ్రామాల్లో ఈ పనులు చేపట్టేందుకు రూ. 5 కోట్లు అవసరమని నివేదించారు. ఇటీవలే నిధులు మంజూరై పనులు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూడగా కొత్త పథకంతో విద్యుత్ సమస్యలు తీరనున్నాయని కథలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే మిగతా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లోనూ చేపడుతామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఓవర్ లోడ్ సమస్య ఉంది



సిరికొండ గ్రామ శివారులో ఓవర్‌లోడ్ సమస్యతో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు సరైన కరెంట్ రావడం లేదు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఓవర్‌లోడ్ సమస్య తీర్చాలని మూడేళ్లుగా ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించాం. స్పందన కరువైంది. ఇప్పుడైనా విద్యుత్ మోటార్ల కెపాసిటీ బట్టి అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి.

– ముదాం రవి, రైతు, సిరికొండ గ్రామం

వరదకాలువ పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలి



కాళేశ్వరం రివర్స్ పంపింగ్‌తో వరద కాలువలో ఎప్పుడు నీరుంటుంది. వరదకాలువలో మోటార్లు పెడితే కరెంట్ కనెక్షన్లు ఇవ్వడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందిగా మారింది. ట్రాన్స్‌కో అధికారులు ఇప్పుడైనా కథలాపూర్, దుంపేట, దూలూర్ గ్రామాల పరిధిలో వరదకాలువ ప్రక్కన ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తే రైతుల పంటలకు నీరు అందించవచ్చు.

– కాయితి నాగరాజు, రైతు, దుంపేట

విడతలవారీగా పనులు చేయిస్తాం

‘సిస్టం స్ట్రెంతనింగ్’ పథకం కింద విడతలవారీగా విద్యుత్ మరమ్మతు పనులు చేయిస్తున్నాం. ప్రస్తుతం కథలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఐదు గ్రామాల్లో పనులు ప్రారంభించాం. రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

– రాకేశ్, ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ విభాగం ఏఈ

ఐఐటీ- జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విజయభేరి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎస్.పవన్ సూర్య 220వ ర్యాంక్, బి.భవ్య 748, పల్లె బిందు 1,482, యూ.మోహన్ సాయి 2,347, బి.సాయిచరణ్ 4,652, ఆర్.అనన్యరెడ్డి 10,299, ఎం.ఈశ్వర్ నాయక్ 10,482, కె.మాధురి 10,712 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. ఎస్.పవన్ సూర్య 99.98, యూ.మోహన్ సాయి 99.10, పి.బిందు 99.08, డి.హారిక 98.11, కె.మాధురి 96.60, డి.వంశీకృష్ణ 95.38, ఆర్.అనన్యరెడ్డి 94.44, జి.రామక్రిష్ణ రెడ్డి 91.88 శాతంసాధించారు. పరీక్షకు హాజరైన 60శాతం మంది ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. విద్యార్థులను చైర్మన్ రమేశ్‌రెడ్డి ,కళాశాలల డీన్ జగన్ మోహన్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధక్రిష్ణ, ఎజీయం. శ్రీనివాస్ అభినందించారు.

బావిలో పడి ఒకరి మృతి

ధర్మారం: ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ముచ్చెర్ల బక్కయ్య(52) ప్రమాదవశాత్తు శనివారం ఉదయం వ్యవసాయబావిలో పడి మరణించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన బక్కయ్య కొంతకాలంగా కొత్తపల్లిలో ఉంటూ సమీపగ్రామం బొమ్మారెడ్డిపల్లి మామిడితోటలో పనిచేస్తున్నాడు. అయితే తోటకు పనికి వెళ్లిన బక్కయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించినట్లు మృతుడి అల్లుడు ఎలుక రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్‌లో లింగంపేట వాసి మృతి


గంగాధర్(ఫైల్)

మేడిపెల్లి(వేములవాడ): లింగంపేట గ్రామానికి చెందిన రాణవేని గంగాధర్(44) దుబాయిలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు శనివారం సమాచారం అందింది. గంగాధర్ కొన్నేళ్లుగా ఉపాధినిమిత్తం దుబాయి దేశం వెళ్లి వస్తున్నాడు. అయితే, శనివారం వేకువజామున అక్కడ గుండెపోటుకు గురై తనగదిలోనే కుప్పకూలిపోయాడు. దుబాయిలో ఉంటున్న అతడి స్నేహితులు శనివారం ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆయిల్ మిల్లులో తలుపుల చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ శివారులోని కరండ్ల సదాశివ్ ఆయిల్‌మిల్లులో ఇనుప డోర్లను దొంగలు శనివారం మధ్యాహ్నం ఎత్తుకెళ్లారు. సదాశివ్‌కు చెందిన ఆయిల్‌మిల్లు కొద్దిరోజులుగా మూతపడి ఉంది. శనివారం మధ్యాహ్నం ఆయిల్‌మిల్లులోకి ప్రవేశించిన దొంగలు.. రూ.30 వేల విలువైన రెండు ఇనుప తలుపులను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.